# బెర్త్ రిజర్వేషన్

-నిష్ఫల

**"ఏవండీ,** ట్రైన్ వచ్చేస్తుంది, మనకు రిజర్వేషన్ యింత వరకు అవలేదు. ఇంతమంది వున్నాం, ఎలా వెళ్తాం?"

ఏదో ఆలోచిస్తున్న వెంకటరమణ, యీ మాట చెవిని పడగానే తుళ్ళి పడ్డాడు "అవును, ఎలా వెళ్తాం?" తనలో అనుకున్నాడు. భార్యకేం సమాధానం చెప్పలేదు.

"మిమ్మల్నే.... మాట్లాడరేం?"

"అదే చూస్తున్నాను. వెళ్ళేదుగ, బహుశా అయిపోయే వుంటుంది" ఆశను వెళ్ళబట్టేడు. వెళ్ళవలసింది బొంబాయి (ముంబాయి) ఆవిడేం అనలేదు.

పెద్దకొడుకు ముంబాయిలో ఉద్యోగం చేస్తున్నాడు. సెలవులిస్తే రమ్మన్నాడు. మరీమరీ చెప్పేడు. ఈ సంక్రాంతి అక్కడే జరుపుకుందాం అన్నాడు. అందుకే బయల్దేరేడు పిల్లల్తో. భార్య మాట కాదనలేక, తనకూ యీ విధంగానేనా చూడొచ్చు కొడుకునని, తప్పనిసరిగా బయల్దేరేడు. రిజర్వేషన్ చేయించాలని నెల బట్టీ అనుకుంటూ ఏదో పనిలో పడి మర్చిపోయాడు. పెళ్ళాం చెప్తూనే వుంది రిజర్వేషన్ చేయించమని. "అలాగేలే..." అనేవాడు తను. తీరా స్టేషన్‌కి బయల్దేరే ముందర ప్యూన్‌ని పంపేడు. వెళ్ళిన వాడు యింకా రాలేదు. వెంకటరమణకు ఆతృతగా వుంది. ట్రైన్ మరో రెండు మూడు నిమిషాల్లో వచ్చేస్తున్నదని ఎనౌన్స్ చేసేరు. ఇంతలో ప్యూన్ వచ్చేడు. దొరకలేదన్నాడు. నడుం విరిగినట్లైంది వెంకటరమణకి. అన్నట్టుగానే మరో కొంత సమయం పోయాక ట్రైన్ వచ్చింది. ప్లాట్ ఫాం హడావిడిగా తయారైంది.. రిజర్వేషన్ లేదు. బండి ఎక్కడం ఎలా. జనరల్ కంపార్టుమెంటుని చూసేడు. ఫుట్ బోర్డుమీద జనం వ్రేలాడుతున్నారు. ప్రయత్నించి ప్లాట్ ఫాం మీద పడ్డాడు ప్యూన్. "లాభం లేదు సార్" అని, "ఈక్యూ" (ఎమర్జన్సీ కోటా) ప్రయత్నం చేయండి అన్నాడు. "అదే కూడా కాస్తా ముందుగానే చేయాలిరా" అన్నాడు వెంకటరమణ చికాగ్గా.

ఇంతలో ఎవరో కండక్టర్ కనిపిస్తే వెంకట రమణ రిక్వెష్టు చేశాడు.

"నో రూం" అనేసి వెళ్ళిపోయాడా కండక్టర్.

నీరు కారేడు వెంకటరమణ. ట్రైన్ డిపార్చర్ టైం అవుతున్నది. ఇంక ఆలోచించలేక పోయాడు. తెగింపుకి సిద్ధపడ్డాడు. ఎదురుగా వున్న కంపార్టుమెంటులో సామాను ఎక్కించేసి, అందర్నీ ఎక్కించి, తనూ ఎక్కాడు. సామాన్లు బాత్‌రూం పక్కగా సర్ది, ఆ పక్కనే అందరూ నిలబడ్డారు. గార్డు విజిల్ వినిపించింది. ట్రైన్ కదిలింది. వెంకటరమణ గుండె ట్రైను చప్పుడు కన్నా పెద్దగా శబ్దం చేస్తూ కొట్టు కుంటుంది. ఎక్కకూడని పెట్టె ఎక్కేనని భయపడు తున్నాడు వెంకటరమణ. నెక్స్ట్ స్టేషన్ దాటింది ట్రైన్. ఇంతలో ప్లాట్‌ఫాం మీద కనబడ్డ కండక్టర్ వచ్చేడు. అతనేమంటాడో అని బిక్కు మంటున్నాడు వెంకట రమణ. తనాఫీసులో తనకు అందరూ నమస్కారాలు చేస్తారు. గౌరవంగా అభిమానిస్తారు. ఇప్పుడు వీడికి నేను దండం పెట్టాలి కామోసు అనకుంటూనే "నమస్కారం సార్" అన్నాడు 'టీసీ'ని చూసి.

"అరెరే! లేదంటే ఎక్కేసేరా?" అందులో ఇది "ఎసి' డబ్బా. మనిషికి పదిహేను వందలు అవుతుంది పెనాల్టీ గాక" అన్నాడు.

"వెంకటరమణ గుండె ఝల్లుమంది. ధైర్యం కూడదీసి, "సార్, తప్పనిసరిగా ఎక్కేసేం. దయచేసి స్లీపర్‌లో ఎక్కడో చేయించండి. పిల్లల్తో వున్నాను. బాంబే వెళ్ళాలి".

"మీరన్నది నిజం కావచ్చును. మీ స్థితికి నా సానుభూతి వుంది. కాని "రూలీజ్ రూల్ ఫర్ వన్ అండ్ ఆల్" నెక్స్ట్ స్టేషన్‌లో దిగిపోండి" అనేసి వెళ్ళిపోయాడు. వెంకటరమణకి ఏం చేయాలో తోచలేదు. భార్య, మంగ తాయారు భర్త దీనావస్థకి జాలి పడింది. పక్క స్టేషన్‌లో దిగిపోదామంది. మన పరిస్థితిని అర్థం చేసుకునేటట్లు లేడీ కండక్టరు. ఇలా అన్నదో లేదో ఏదో స్టేషన్‌లో ఆగింది ట్రైన్. వెంటనే అందరూ దిగిపోయి సామానుతో సహా పక్క కంపార్టుమెంటులోకి ఎక్కేసేరు.

కలియ జూసేడు వెంకటరమణ. అదీ రిజర్వు కంపార్టుమెంట్! ఇంతలో కొడుకు "అన్నీ చూసేను నాన్న. ఏ ఒక్క సీటూ కాళీ లేదన్నాడు. ఇది కూడా రిజర్వుదే".

"అవున్రా, మనకు రిజర్వేషన్‌లేదు. వీడేం అంటాడో? ఇంతలో రానే వచ్చేడు 'టీసీ'. వీళ్ళని చూసి "రిజర్వేషన్ వుందా?" అడిగాడు.

"ప్రయత్నం చేశాం, దొరకలేదు సార్" బాంబే వెళ్ళాలి. దయచేసి మీరే అరేంజ్ చేయండి"

కండక్టర్ ఎగాదిగా చూసి "లేదండి" అనేశేడు.

వెంకటరమణ తన దీనావస్థను చెప్పుకుని, కనీసం రెండు బెర్తులేనా యిప్పించండన్నాడు.

"అసలు మీరు రిజర్వేషన్ లేకుండా రిజర్వుడు కంపార్టుమెంటు ఎందుకెక్కేరు. అందుకు మీకు వెయ్యి రూపాయలు ఫైన్ వేస్తున్నాను. తీయండి"

ఆ మాటతో వెంకటరమణ ఖిన్నుడయ్యాడు. చేసేది లేక వేయి రూపాయలు కట్టుకున్నాడు. పక్క స్టేషన్‌లో దిగిపోయారు. ఇలా మూడుసార్లు దిగి ఎక్కేరు. ప్రాణం విలవిలమంటుంది. అవమానం మరో ప్రక్క కృంగ దీస్తుంది. 'రిజర్వేషన్ లేకుండా ఎక్కడం నాదే తప్పు"ను కున్నాడు మనసులో.

ఎక్కింది జనరల్ కంపార్టుమెంటు. పిల్లలూ, భార్యా అదోలా వుండిపోయారు. అయితే యిక్కడెవరూ దిగి పోమనరు. ఓ సీటు కూడా కాళీలేదు. ఒక్క సీటులో ఇద్దరేసి సర్దుకున్నారు. మళ్ళా బాత్‌రూం పక్కనే నిలబడ వలసి వచ్చింది. వీళ్ళలాటివారే మరి కొందరక్కడ వున్నారు. బాత్‌రూంకి వెళ్ళిన వాళ్ళు వెళ్తున్నారు. వస్తు న్నారు. వీళ్ళని తోసుకుంటూ. దుర్గంధం భరించ లేకుండా వున్నారు. అక్కడ కూడా జాగాలేక ఒంటి కాలు మీద నిల్చున్నట్టు నిల్చున్నారు వెంకటరమణ అండ్ ఫ్యామిలి.

"నాన్నా నేనే కండక్టర్ని కలిసి వస్తున్నాను. రెండు వేల రూపాయలిస్తే మనకు బెర్తులు ఎరేంజి చేస్తానన్నాడు" చిన్నకొడుకు చెప్తే, ఆయన దగ్గరకు తోసుకుంటూ వెళ్ళి అడిగేడు వెంకటరమణ. అతని యూనిఫాంలో చూసి కండక్టరే అనుకున్నాడు. రెండు వేలిచ్చేసేడు.

"నేనిప్పుడే వస్తాను. మీరక్కడే వుండండి. మీ బెర్తులు ఖాయం" అనేసి వెళ్ళిపోయాడు. ఓ గంట చూసేడు. చూస్తూనే వున్నారు. వెళ్ళిన వాడు తిరిగి రాలేదు. తను మోసపోయాడని తరువాత తెలిసింది. "మీరు మోసపోయారు. కొందరు ఇలాటి వేషాలేసి ప్యాసింజర్లను మోసం చేస్తున్నారు" మరో కండక్టర్ చెప్పేడు. వెంకట రమణ తల పట్టుకున్నాడు. తన తెలివి తక్కువకి తనకే కోపం వచ్చింది. భార్య ఏడు స్తుంది. పిల్లలు బిక్క మొహంతో నిల్చున్నారు. తల్లిని పొదివి పట్టుకున్నారు. ఇంతలో ఇద్దరు ముష్టివాళ్ళు ఎక్కేరు. వీళ్ళ పక్కనే నిల్చున్నారు. వాళ్ళ దగ్గర కంపు కొడుతున్నది. భరించ లేక పోతున్నారు వీళ్ళు. అందులో ఒకడు బీడీ కాలుస్తున్నాడు. "ఛీ... ఛీ... ఏం జన్మ? ఇలాంటి తప్పు ఎప్పుడూ చెయ్యకూడదని మనసులోనే చెంపలు వేసుకున్నాడు వెంకటరమణ.

బొంబాయి వచ్చేస్తున్నదన్నారు ఎవరో. అది విన్న వెంకటరమణ భగవంతునికి మనః పూర్వక నమస్కారం చేసుకున్నాడు. కాస్తా ఊపిరి పీల్చుకుని సామాన్లని ఓ దగ్గరగా పెట్టి పిల్లల్ను జాగ్రత్తగా దిగండని హెచ్చరిం చేడు. భార్యా, పిల్లల్ని చాలా హింసకు గురిచేసేనని బాధపడ్డాడు. ఏదో అనుకున్నాడు గానీ యిన్ని బాధలుం టాయనుకోలేదు. ఇంతలో స్టేషన్‌లో ట్రైన్ ఆగింది. మహాపట్నం బాంబే! ఎంత జనం! కలియ జూచేడు. అందర్నీ తప్పించుకుంటూ పెద్దబ్బాయి రావడం చూసి పెదవుల మీద నవ్వు మల్లెలా విరిసింది.

"ఏమిటి నాన్నా యిలా వున్నారు. ప్రయాణం బాగా జరిగిందా?"

దాంతో ఏడవాలో నవ్వాలో తెలియక-

"పద ఇంటికి, చెప్తానన్నాడు" పాపం వెంకట రమణ.

■

## నీరు-కన్నీరు

ఎప్పుడు రాలుతుందో నీటిచుక్క
ఎప్పటికి ఆరుతుందో కన్నీటి చుక్క
ఓ మనిషీ మేఘాన్ని మధించటం కాదు
నీ అంతరంగాన్ని మధించు
ప్రకృతి సమతౌల్యాన్ని రక్షించు
భూగర్భ జలాన్ని రక్షించు
అప్పుడే ఈ భువి అవుతుంది భూతల స్వర్గం.
లేకపోతే ఈ భువి అవుతుంది క్షామదేవతకు నిత్య నివాసం
ఎన్నటికీ రాలనే రాలదు నీటిచుక్క
ఎన్నటికి ఆరనే ఆరదు కన్నీటి చుక్క.

-మోపూరు పెంచల నరసింహం

Edited, Printed and published by Anil Inaganti for Monica Publications, 79B, Journalists Colony, Jubilee Hills, Hyderabad - 500 033. E-mail: patrika@hotmail.com. Printed at Dharani Printers, 6-3-985, Yousuf Building, Khairatabad, Hyderabad - 500 004. Chief Editor: Inaganti Venkata Rao.